క్లుప్తంగా

ఉపాధి కూలీలను ఆదుకోవాలి

ఎదులాపురం: తేనెటీగల దాడిలో గాయపడిన బేల మండలం రేణిగూడ గ్రామ ఉపాధి కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అర్ధాంగి రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో చికిత్స పొందుతున్న కూలీలను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. ఇందులో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చిలుక దేవిదాస్, సీపీఐ సీనియర్ నాయకులు గణపతి, తదితరులు ఉన్నారు.

పల్లకి ఊరేగింపు



పల్లకిసేవలో పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: శ్రీరామనవమి నేపథ్యంలో పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న హనుమాన్ ఆలయంలో చేపట్టిన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మూడో రోజైన శుక్రవారం ఐదోవార్డు పరిధిలోని ఇంద్రనగర్‌లో పల్లకిసేవ ఊరేగింపు నిర్వహించారు. అర్చకులు కీర్తి రాఘవశర్మ ఆధ్వర్యంలో శోభాయాత్రలో భక్తులకు హారతి ఇచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో పెరిక గంగాధర్, అడ్డగట్ల రాజన్న, పాదం రాకేశ్, నరేందర్, రవి, వంశీ, చింటు తదితరులున్నారు.

పరామర్శ

ఖానాపూర్: పట్టణంలోని సుభాశ్‌నగర్‌కు చెందిన ఉప్పు నవీన్ గల్ఫ్ దేశం బేరాన్ వెళ్లి అక్కడ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. శుక్రవారం బాధిత కుటుంబాన్ని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు తిలక్‌రావు పరామర్శించారు. ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి మృత్యువాత పడ్డ వారి మృతదేహాలను వెంటనే స్వదేశాలకు తెచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వారి వెంట లక్ష్మణ్, తదితరులున్నారు.

విగ్రహావిష్కరణకు తరలిరండి



మాట్లాడుతున్న సునారికారి రాజేశ్

కడెం: మండలంలోని కొత్త మద్దిపడగలో ఏర్పాటు చేసే అంబేద్కర్ విగ్రహావిష్కరణకు అంబేద్కర్ సంఘ నాయకులు, అభిమానులు తరలిరావాలని నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో మాట్లాడారు. శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చేతుల మీదుగా విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో అంబేద్కర్ సంఘ భవన నిర్మాణ కమిటీ కన్వీనర్ సునారికారి రాజేశ్, కోకన్వీనర్లు ఇందూర్ నేత, లింగన్న, బొడ్డు గంగన్న, జడ రాజేశ్వర్, రాజలింగం, వెంకన్న, చిన్నయ్య, గంగన్న, శంకర్, గంగాధర్, రాజేందర్ తదితరులున్నారు.

నీటి విడుదలపై హర్షం

కడెం: సదర్మాట్ కాలువకు నీటిని విడుదల చేయడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే బొజ్జుకు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు రాజకీయ లబ్ధి కోసం ఉపాధి కూలీలతో ధర్నాలు చేయడం సిగ్గు చేటని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి అన్నారు. కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు వాజిద్‌ఖాన్, మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్, బొడ్డు గంగన్న, నాయకులు రాజు, భూషణ్, శ్రీనివాస్, రాజలింగం తదితరులున్నారు.

బోర్‌వెల్‌ల ఏర్పాటు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలో ఉన్న కొమ్ముతండా, తుమ్మగూడెం, ఇప్పమాడ గ్రామాల్లో శుక్రవారం బోర్‌వెల్‌లను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని నాయకులు ఎమ్మెల్యే బొజ్జు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఎస్‌డీఎఫ్ నిధులతో తాగునీటి ట్యాంకుల కోసం బోర్లను వేయించినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాంచందర్, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, బలరాం నాయక్, శివ్‌లాల్, వసంత్, మల్లేష్, వినోద్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

జయంతి నిర్వహణకు అనుమతివ్వాలి

ఖానాపూర్: ఎన్నికల కోడ్‌తో సంబంధం లేకుండా ప్రభుత్వ, పంచాయతీ కార్యాలయాల్లో అంబేద్కర్ జయంతి అధికారికంగా నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వాలని అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాసమల్ల అశోక్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్, అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు మేస సతీశ్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌కు ప్రోత్సాహం కరువు

- ఊసేలేని నిర్వహణ ఖర్చులు
- కానరాని అధికారుల పర్యవేక్షణ
- ఆందోళనలో రైతులు



రాంపూర్(బి)లో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ పంట

సిరికొండ: పత్తి, జొన్న, గోధుమ, కూరగాయల పంటే కాకుండా ఇతర పంటలను పండించాలని గత ప్రభుత్వం రైతులను ప్రోత్సహించింది. మార్కెట్లో డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్ సాగు చేయాలని రైతులకు అవగాహన కల్పించింది. ఎస్సీ, ఎస్టీలకు పూర్తిస్థాయిలో, బీసీలకు 90 శాతం సబ్సిడీతో ఆయిల్‌పామ్ పంట సాగు చేసేందుకు ప్రోత్సహించింది. దీంతో చాలా మంది రైతులు ఈపంటను సాగు చేసేందుకు ముందుకు వచ్చారు.

రాని నిర్వహణ ఖర్చులు..

ఆయిల్‌పామ్ సాగులో ప్రభుత్వ ప్రోత్సాహం లభిస్తుందని ముందుకు వచ్చిన రైతులకు నిరాశే మిగిలింది. దేశంలో అధిక డిమాండ్ ఉందని అప్పటి తెలంగాణ ప్రభుత్వం రైతులకు అవగాహన కల్పించి, సాగును ప్రోత్సహించింది. దీంతో అనేక మంది రైతులు సబ్సిడీ పోను ఒకో రైతు రూ. 50 వేల నుంచి లక్ష వరకు ఖర్చు చేసుకొని పంట సాగు చేశారు. మూడు సంవత్సరాల పాటు ఎకరానికి రూ. 4 వేలు నిర్వహణ ఖర్చు భరిస్తామని వాటిని ఎరువులు, పిచ్చిమొక్కలు తొలగింపు వంటి పనులకు వాడుకునేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. కానీ ఇప్పుడు పంటలను సాగు చేస్తున్న రైతులకు నిర్వహణ ఖర్చులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నామని వాపోతున్నారు.

పర్యవేక్షణ కరువు..

మండలంలో ఆయిల్‌పామ్ పంటను సాగు చేయడం మొదలుపెట్టి సంవత్సరం అవుతుంది. ఆయిల్‌పామ్‌ను పర్యవేక్షణ చేసేందుకు ఇప్పటి వరకు అధికారులు రావడం లేదని, ఎలాంటి మందులు వాడాలి, ఎంత మోతాదులో వాడాలి అనే విషయాలు తెలియక నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. అధికారులు పరిశీలించి, సలహాలు, సూచనలు చేయాలని కోరుతున్నారు.

నిర్వహణ చార్జీలు రావడం లేదు



మూడేకరాలలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నాను. నాకు సుమారుగా 50 వేల పైగా ఖర్చు వచ్చింది. పంటను నాటే సమయంలో అధికారులు ప్రతీ సంవత్సరం ఎకరానికి రూ.4 వేలు నిర్వహణ చార్జీలు వస్తుందని చెప్పారు. కానీ పంటను నాటి రెండేళ్లు అవుతున్నా.. ఇప్పటికీ ఎలాంటి ఖర్చులు లేవు.

– మోరె నీలకంఠ, రైతు, రాంపూర్ (బి)

పట్టించుకోని అధికారులు



మూడేకరాలలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నాను. పంట గురించి అంతగా అవగాహన లేదు. సాగు మొదలుపెట్టి రెండు సంవత్సరాలు అవుతున్నా.. ఇప్పటి వరకు పర్యవేక్షించేందుకు మాత్రం ఎవరూ రావడం లేదు. ఎండు తెగులు సోకితే ఎలాంటి మందులు వాడాలో తెలియడం లేదు.

– లక్కం మల్లేష్, రైతు, సిరికొండ

ఆత్రం సుగుణను గెలిపించాలి



కండువా కప్పుతున్న కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని, అందుకోసం కార్యకర్తలు చిత్తశుద్ధితో పనిచేయాలని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పిప్పల్‌ధరి, యాపల్‌గూడ, బూర్నూర్, జైనథ్ మండలంలోని నిరాలకు చెందిన గ్రామస్తులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వందరోజుల్లోనే ప్రభుత్వం ఐదు గ్యారంటీలను అమలు చేసిందన్నారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిందని గుర్తు చేశారు. పార్టీలో చేరిన వారందరికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఏ ఎన్నికలు జరిగిన కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఆడె గజేందర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, షేక్ అబ్దుల్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విస్తృత ప్రచారం

కైలాస్‌నగర్: పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రజలను పలుకరిస్తూ.. వారి సమస్యలు తెలుసుకుంటూ.. కరపత్రాలు పంచిపెట్టారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కౌన్సిలర్లు దర్శనాల లక్ష్మణ్, సాయి ప్రణయ్, అంజు, శ్రీలేఖ, జాకీర్ పాల్గొన్నారు.

'కార్యకర్తలకు అశ్విన్‌రెడ్డి గాడ్ ఫాదర్'



అశ్విన్‌రెడ్డితో నాయకులు, కార్యకర్తలు

నేరడిగొండ: కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు, ప్రముఖ వ్యాపారవేత్త ఏలేటి అశ్విన్‌రెడ్డి మాకు గాడ్ ఫాదర్ అని వివిధ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అశ్విన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. పార్లమెంట్ ఎన్నికల్లో ముందు ఉండి కార్యకర్తలకు దిశానిర్దేశం చేయాలని కోరారు. స్పందించిన ఆయన ప్రతీ కార్యకర్తకు ధైర్యం ఇస్తానని, రానున్న ఎన్నికల్లో అందరూ కలిసి ప్రచారం చేద్దామన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు జాదవ్ వసంత్ రావ్, సీనియర్ నాయకుడు నల్ల శ్రీకాంత్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, తొడసం దౌలత్‌రావు, రామ్ లక్ష్మణ్ గౌడ్, గడ్డం నరేష్ రెడ్డి, ఎరడ్ల చంద్రశేఖర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఇంద్రవెల్లి: కాంగ్రెస్‌తోనే అన్నిగ్రామాల అభివృద్ధి సాధ్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాన్గే ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 8 మంది తాజీ మాజీ సర్పంచ్‌లతో పాటు బీఎస్పీ మండల అధ్యక్షుడు ఆరీఫ్, బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ కులాలు, మతాల మధ్య చిచ్చు పెడితే సహించబోమని హెచ్చరించారు. ఆత్రం సుగుణను పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, పట్టణ అధ్యక్షుడు జహీర్, ఎండీ మసుద్, సోమోరే నాగోరావ్ పాల్గొన్నారు.

'బీజేపీ, బీఆర్ఎస్‌లను నమ్మొద్దు'

ఉట్నూర్‌రూరల్: బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను నమ్మొద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తల సమావేశంలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి పాల్గొన్నారు. డీసీసీబీ డైరెక్టర్ సామ ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరడం జరుగుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త గడప గడపకు వెళ్లి ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖయ్యుం, చంద్రయ్య, ఎక్బాల్, అజీం, లాజర్, తదితరులు పాల్గొన్నారు.

టీటీడబ్ల్యూఆర్‌సీఓఈకి విద్యార్థి ఎంపిక



అడేగాం రాకేశ్

నేరడిగొండ: తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీ (టీటీడబ్ల్యూఆర్‌సీఓఈ) ప్రవేశ పరీక్షలో నేరడిగొండ మండలం వాంకిడి గ్రామానికి చెందిన విద్యార్థి అడేగాం రాకేశ్ ప్రతిభ కనబరిచాడు. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన ఆయన 2024లో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షలో రాణించి, జిల్లాల గడ్డ, హుస్నాబాద్, సిద్దిపేట్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయుడు చక్రపాణి, సిబ్బంది రాకేశ్‌ను అభినందించారు.

పోచమ్మతల్లి విగ్రహావిష్కరణ



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

జైనథ్: తెలంగాణ సాంస్కృతిలో గ్రామ దేవతలకు అత్యంత ప్రాధాన్యం ఉంటుందని, ఏ పని చేసిన గ్రామదేవతలకు పూజలు చేసిన తరువాతే ప్రారంభించడం జరుగుతుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని సాంగ్వి గ్రామంలో నిర్వహించిన పొచ్చమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరయ్యారు. గ్రామస్తులు ఆయనకు డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామస్తులతో కలిసి ఆలయం ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విఠల్ రెడ్డి, మయూర్ చంద్ర, అశోక్ రెడ్డి, భూమన్న, సురేష్, తరుణ్, వైభవ్, సురేశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎదులాపురం: విద్యుత్ మరమ్మతులో భాగంగా పట్టణంలోని పలు ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎస్ఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భుక్తాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని భుక్తాపూర్, ద్వారకానగర్, సినిమారోడ్, మోచిగల్లీ ఏరియాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే సీసీఐ సబ్‌స్టేషన్ పరిధిలోని జీఎస్ ఎస్టేట్, తిర్పెల్లి, బద్కు మొహల్ల, బ్రాహ్మణవాడ, పంజేషా మొహల్ల ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. కైలాస్ నగర్, మావల ఫీడర్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు, ఖానాపూర్, కైలాస్‌నగర్, మావల, రిమ్స్ సబ్ స్టేషన్ ఏరియాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారిగూడ, పిప్పల్‌ధరి, అంకోలి సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ అధికారి తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

జైనథ్: మండలంలోని గిమ్మ, పెండల్‌వాడ సబ్‌స్టేషన్ మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ గంగాధర ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందన్నారు.

ఇచ్చోడ: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రాజు తెలిపారు. ఇచ్చోడ, నర్సాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుతుందన్నారు.

అంబేద్కర్ జయంతి జయప్రదం చేయండి

ఎదులాపురం: అంబేద్కర్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. ఎన్నికల నియామవళి అమలులో ఉన్న నేపథ్యంలో అంబేద్కర్ 134వ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం లేదని, రాజకీయాలకు అతీతంగా అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 14న జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో నిర్వహిస్తున్న జయంతి ఉత్సవాల్లో అంబేద్కర్ వాదులు, అన్ని కుల సంఘాల నాయకులు, రాజ్యాంగ పరిరక్షకులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నగేశ్, ప్రశాంత్, నవీన్, దయాకర్, సందీప్, రమేశ్, శంకర్, సుదర్శన్ పాల్గొన్నారు.

'మత రాజకీయ పార్టీలకు బుద్ధి చెప్పాలి'



మాట్లాడుతున్న కిరణ్ ముగాబసవ

ఇచ్చోడ: మతం పేరుతో రాజకీయం చేస్తున్న పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జాతీయ కోఆర్డినేటర్ కిరణ్ ముగా బసవ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం కేవలం అధికారం కోసం ప్రజల మధ్య చిచ్చు పెడుతుందన్నారు. పది సంవత్సరాలుగా బీజేపీ మతం పేరుతో ఓట్ల రాజకీయం చేస్తుందని మండిపడ్డారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గం ఇన్‌చార్జి ఆడే గజేందర్, తలమడుగు జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, ఆత్రం భాస్కర్, పసుల చంటి, కుంర కోటేశ్వర్, మహమూద్ ఖాన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసు బలగాల కవాతు



సిర్పన్నలో కవాతు చేస్తున్న పోలీసులు

బేల: మండలంలోని సిర్సన్న, అవాల్‌పూర్ గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం కేంద్ర ప్రత్యేక బలగాలతో పాటు స్థానిక సిబ్బందితో కవాతు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ సీఐ సందీప్, జైనథ్ ఎస్సై పురుషోత్తం, బేల ఎస్సై రాధిక, తదితరులు పాల్గొన్నారు.

పచ్చని స్వాగతం..



తాంసి: హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు ఏపుగా పెరిగి పచ్చని అందంతో ఆకట్టుకుంటున్నాయి. భీంపూర్ మండంలోని సాంగి గ్రామం నుంచి భీంపూర్ వరకు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ప్రజలను, వాహనదారులకు కనువిందు చేస్తూ.. చల్లని నీడనిస్తున్నాయి.



ఎండిన బోర్లకుంట

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి శివారులోని బోర్ల కుంట పూర్తిగా ఎండిపోయింది. ప్రతీవేసవిలో నీరుండి పశువుల దాహార్తి తీర్చేది. అయితే ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతోంది.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సర్ఫారాజ్

ఆదిలాబాద్‌రూరల్: పరిసరాల పరిశుభ్రతతో పాటు విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సర్ఫారాజ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కొలాం గిరిజన ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంట గదిని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వేడి భోజనం వండించాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య పర్యవేక్షకుడు బొమ్మెత సుభాష్, ఆరోగ్య కార్యకర్తలు నల్ల ఈశ్వర్ రెడ్డి, పవర్ ప్రేమ్‌సింగ్, మరప ముయ్యాల మోతి, ఆశలు నర్మద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

తాంసి: మండలంలోని కప్పర్లలో ఇటీవల నూతనంగా నిర్మించిన రామాలయంలో శుక్రవారం సాయంత్రం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు విశాల్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. మహిళలచే గౌరిపూజ, గణపతి పూజ, కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మహేందర్, గంగన్న, నారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలవికాస వాటర్ ప్లాంట్ ప్రారంభం



ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్

జైనథ్: మండలంలోని సాంగి గ్రామంలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను మాజీ సర్పంచ్ విఠల్‌రెడ్డి ప్రారంభించారు. బాలవికాస స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ప్రసూన్‌రెడ్డితో కలిసి ప్లాంట్ వద్ద పూజలు నిర్వహించారు. నిరుపేదకు శుద్ధమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవిదాస్, నాయకులు గాలెన్న, బొల్లి అశోక్, సామ లింగారెడ్డి, పురుషోత్తం రెడ్డి, అభిలాష్, బొంత సాయి, ఆకుల నాగన్న, భోయర్ నితిన్ పాల్గొన్నారు.